# ఎవరికోసం

**శ్రావణ పూర్ణిమ. వెన్నెల డాబా మీదకు పాకిన సన్నజాజి పందిరి విరగబూసి సువాసనలు వెదజల్లుతోంది. చాపమీద పరుపువేసుకుని తెల్లని దుప్పటి వేసుకుని, తలదగ్గర పాకెట్ టేప్ రికార్డర్ పెట్టుకుని గులాం అలీ గజల్స్ వింటున్నాడు మోహన. మనసులో మధురమైన ఆలోచనలు.**

ఈలోగా గాజులు చప్పుడు అయింది. తను గబుక్కున సర్దుకుని నిద్రపోయినట్టుగా నటించసాగేడు. రాజ్యం పనంతా పూర్తిచేసుకుని స్నానం చేసి తెల్లచీర కట్టుకుని విరజాజిపూవులు పెట్టుకుని భర్త దగ్గరకు వచ్చింది. " అయ్యో ఈయన పడుకుండిపోయారే " అనుకుంది. మోహనకు నిద్రాభంగం చేయడం ఇష్టంలేక మెల్లగా వెళ్ళి కాళ్ళదగ్గర కూర్చుంది.

ఇంతలో మోహన చటుక్కున లేచి " దొంగా ఇంతసేపు నేనేమైపోవాలి " అంటూ కాళ్ళు చాపి కూర్చున్న ఆమె వొడిలో తలపెట్టుకుని పడుకున్నాడు చంటిపిల్లాడిలా. " అమ్మదొంగా నిద్రపో లేదా " అంటూ జుట్టులో వేళ్ళు పెట్టి సున్నితంగా ముఖాన్ని దగ్గరకు లాక్కుని నుదుటిమీద ముద్దాడింది రాజ్యం-

" పిల్లలు పెద్దాళ్ళయి పోయినా మనం ఇద్దరమే అయినా ఇంట్లోపని తగ్గదు కదా ! పని అంతా అయ్యేసరికి ఇంత సేపయింది- "

" చాల్లే, వెధవ పని ఎప్పుడూ నువ్వు లేకుండా ఎంతసేపు ఒంటరిగా పడుకోవాలి. నేను పడుకోవటమంటూ జరిగితే, నా పక్కన రాజ్యం వుండాలి. కాకపోతే రాజ్యంలేని రాజునై బికారినై పోతాను "

" చాల్లే సరసం ఇంత వయసొచ్చినా ఇంకా భార్య పక్కన వుండాలనుకోవడం తప్పు"

" నీకు నా పక్కన పడుకోవడం ఇష్టం వుండదా రాజ్యం చెప్పు మానేస్తాను - "

అతని నోటికి చేతులు అడ్డంపెట్టి " మగాళ్ళు, మాట్లాడినట్లు ఆడాళ్ళు విప్పలవిడిగా మాట్లాడలేరు " అంది. వెంటనే ఆమె పెదాలు అందుకుంటున్నాడు మోహన.

" రాజ్యం, మనం పెద్దాళ్ళమైపోయాం కదా. ఒకవేళ ఏదైనా అనుకోనిది జరిగితే నేను దూరమైతే - "

ఎలా జరుగుతుంది ?

" అంటే మరణాన్ని జయించలేము కదా - "

" నేను వెంటనే చచ్చిపోతాను. ఇద్దరం ఒక్కసారే వెళ్ళిపోవాలి, ఎక్కడికైనా సరే- "

మోహన్ వెంటనే ఆమె నోరు మూసి " సరదాకు కూడా మనం ఇలాంటి మాటలు మాట్లాడుకోకూడదు. సరేనా - " అనుకుని ఇద్దరూ ప్రేమసామ్రాజ్యంలో విహరించారు. అంత వయసొచ్చినా కొత్త దంపతుల్లాగా ఒకరిలో ఒకరు మమైకం అయిపోయిన ఆ దంపతుల్ని, మబ్బుల్లో నుండి చందమామ బయటికి వచ్చి కళ్ళు బాగా తెరుచుకుని సిగ్గు విడిచి చూస్తున్నాడు. అటువంటి దృశ్యం మళ్ళీదొరకదేమో నన్నట్లుగా.

✸ ✸ ✸

"నాన్నగారూ భోజనానికి లేవండి- " అంటున్న అబ్బాయి కేకతో స్వప్నలోకాలలోంచి బయటకు వచ్చాడు మోహనరావు.

రాజ్యం తనను అన్యాయం చేసి వెళ్ళిపోయింది. సరిగ్గా నెలక్రితం ఈ డాబా మీద తన ఒడిలో పడుకుని అన్నమాటలు నిజమయ్యాయి. కాని తను మాత్రం రాజ్యం వెంట వెళ్ళలేకపోయాడు. ఒక వేళ తను చనిపోయివుంటే రాజ్యం అన్నంతపనీ చేసివుండేదేమో. తను ఎంత స్వార్ధపరుడు? రాజ్యాన్ని అగ్నికి ఆహుతి చేసి వచ్చాడు. తను ఇప్పుడు ఏకాకిగా, తమ పెళ్ళయిన మొదటిరోజు, రాజ్యం మోజుతో కొనుక్కున్న చాపమీద ఏ దుప్పటీ లేకుండా పడుకుంటున్నాడు. ఆ చాపచింకి చాప అయిపోయింది. అయినా సరే, ఆ చాపమీద పడుకుని పంచభూతాల్లో ఐక్యమైపోయిన రాజ్యాన్ని, ఆకాశంలోకి చూస్తూ రాజ్యాన్ని తమలో ఇముడ్చుకున్న గాలి ఆకాశం సాయంతో ఆమె రూపాన్ని చూడాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

డాబామెట్లు దిగుతున్నాడు మోహన. బెడ్‌రూమ్ కిటికీలోంచి అమ్మాయిల మాటలు వినిపిస్తున్నాయి. మెట్లమీద ఆగేడు.

" రేపటితో కార్యక్రమాలన్నీ అయిపోతాయి కదా. నీ ప్రోగ్రాం ఏమిటి? " పెద్దమ్మాయి అంటోంది.

" నువ్వేం చెప్తే అది. మరి మనకూ సంసారాలు వున్నాయి కదా! నాన్నగారి దగ్గరే ఎలావుండిపోతాం? కొన్నాళ్ళు అన్నయ్య వదినా వుంటారేమోలే- " అంటోంది చిన్నమ్మాయి.

" వదిన మాత్రం ఎందుకు వుంటుంది లేవే - దానికి మాత్రం పిల్లా జెల్లా లేరా? "

" నేను ఒక విషయం ఆలోచించాను. మనకు బాధగా వుంటుందనుకో, కాని తప్పదు. అమ్మ ఏడువారాల నగలు, పట్టుచీరలు అన్నీ మనం ఇద్దరం చెరిసగం తీసుకుందాం. ఒకవేళ అన్నయ్య కాదన్నాడనుకో, ఆస్తి, నగలు, వెండి సామాను, ఇతర సామాన్లు అన్ని మూడు వాటాలు పంచుమందాం. నాన్నగారు ఎప్పుడో మన పెళ్ళిళ్ళకు కట్నాలిచ్చి పెళ్ళి చేశారుగాని, మనం మాత్రం ఏం అందచందాలు ఎరుగుదుం " పెద్దమ్మాయి అంటోంది.

" అది కాదే - మనం ఇప్పుడే ఈ విషయాలు మాట్లాడటం అంత మంచిది కాదేమో. అసలే నాన్నగారు అమ్మపోయిన దిగులులో వున్నారు. ఈ దిగులుకు తోడు - " చిన్నమ్మాయి మాటలకు అడ్డువచ్చి.

" పిచ్చిసన్నాసీ. నీకు తెలియదే. నాన్నగారు అమ్మపోయిన దిగులులో వుండగా, ఈ సిరిసంపదలు, భోగభాగ్యాలు చూసి ఎవరో ఒకరు నాన్నగార్కి మళ్ళీ పెళ్ళి చేసేస్తారే. అప్పుడు మనకు పిన్ని వచ్చిందంటే అసలుకు మోసం వస్తుంది. "

" సరే నీ ఇష్టం- "

" నా ఇష్టం కాదు. నేను అన్నయ్యతో. మాట్లాడేటప్పుడు నువ్వు ఏమీ మాట్లాడకు. ఏదైనా అనుమానం వస్తే తరువాత నన్ను అడుగు తెలిసిందా? " అంటోంది పెద్దమ్మాయి.

మోహన్‌రావు మనసులో భార్య దుఃఖజ్వాలలో వీళ్ళ సంభాషణ సమిధలా పడి మరింత జ్వలించసాగింది.

జీవితం ఇంతే. రాజ్యానికి ఎన్ని నగలు, ఎన్ని పట్టుచీరలు ? రాజ్యమే బంగారురంగులో వుండేది. పిల్లలు ముగ్గురికీ వాళ్ళ పిల్లలకూ పేరు పేరున వెండి సామాన్లు చేయించింది. రాజ్యాన్ని ఎప్పుడూ ఎఱ్ఱంచు పసుపు పట్టుచీర కట్టుకోమనే వాడు శ్రావణ శుక్రవారం, ముఖం నిండా పసుపుతో, నుదుట పెద్ద కుంకుమ బొట్టుతో సాక్షాత్తూ భువినుండి దిగి వచ్చిన లక్ష్మీదేవిలా ప్రత్యక్షమయ్యేది. తను కళ్ళార్పకుండా చూసేవాడు.

ఒకరోజు తను బజార్నుండి నారింజ రంగు జరీ అంచుతో తెల్లని పట్టుచీర తీసుకువచ్చి

" ఇదుగోనోయ్ " అంటే

" ఏమిటి? "

" దీపావళి నీ పుట్టినరోజు కదా, నీ కోసం తెచ్చాను. ఆ రోజు దేవిగారు ఇది కట్టుకుని దీపావళి సామాన్లు కాలుస్తుంటే ఆ వెలుగులో ఈ దేవిని చూసుకుంటాను " అన్నాడు

తను.

" చిలిపి-పిల్లలు పెద్దాళ్ళయిపోయినా వేషాలు తగ్గలేదు. "

" నీకు తెలుసా రాజ్యం? ఏభై దాటేక మగాడికి పునర్యవ్వనం వస్తుందంట - అంటే ఇప్పుడు నీకు కుర్రమొగుణ్ణి అన్నమాట " ముసి ముసి నవ్వులు నవ్వుతూ తల వంచుకున్న రాజ్యం రూపం ఇంకా తన కళ్ళల్లో మెదులుతోంది.

దీపావళి రాలేదు. దీపావళి కాంతులలో ఆ పట్టుచీరలో చూడాలనుకున్న రాజ్యం, శాశ్వతంగా దూరం అయిపోయి, అంధకారం చేసింది జీవితాన్ని.

కొడుకు, కోడలు, అల్లుళ్ళు, కూతుళ్ళు, మిగతావాళ్ళు, " అయ్యో పట్టుచీర" అని లోలోపల బాధ పడుతున్నా సరే పదివేలరూపాయల నారింజరంగు అంచున్న తెల్లని పట్టుచీర చుట్టబెట్టి రాజ్యాన్ని శాశ్వతంగా సాగనంపాడు మోహనరావు.

మరోనాలుగు మెట్లు దిగాడు. మరో పడకగదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి. కొడుకు కోడలు ఘర్షణ పడుతున్నట్లున్నారు. ఆగేడు వాళ్ళ మాటలు వినడానికి.

" మీ చెల్లెళ్ళు ఇద్దరూ, అత్తగారి నగలు, వెండిసామాన్లు తీసేసుకుంటారట పట్టుచీర కూడా నాకు ఒక్కటి కూడా ఇవ్వకుండా తీసేసుకుంటారట. ఇదేం న్యాయం చెప్పండి మీరు గాజులు తొడుక్కుని కూర్చోబట్టి ఇలా జరుగుతోంది. "

" అబ్బ ఊరుకోలే ఇది సమయం కాదు తరువాత తీరికగా మాట్లాడుకుందాం- "

" అవునులెండి అంతా అయిపోయాక మీకేం మిగులుతుంది. ఆయన తదనంతరం ఈపాతమేడ మీకు వ్రాస్తారు. చివరకు మీకు మీ జీతం, నా ముఖం గతి. అయినా మిమ్మల్నని ఏం లాభం నాఖర్మ ఇలా కాలింది " ఏడుస్తోంది కోడలు.

" సర్లే ఇప్పుడు ఏడుపులు పెడబొబ్బలు పెట్టకు అమ్మపోయిన దుఃఖంలో నేనూ, నాన్నగారూ వుంటే ఇదేం మేళం? మీ ఆడాళ్ళకు బుద్దిలేదు. అబ్బాయికి కోపం వచ్చింది. "

మోహనకి మెట్లమీద నుంచి కళ్ళు తిరిగినట్లనిపించింది. తన గుండెల్ని మామిడి పండులా చేత్తో పట్టుకుని ఎవరో కర్కశంగా పిండివేస్తున్నంత బాధ అవ్యక్తమైన బాధ. వీళ్ళు తన కన్నపిల్లలేనా ! ఎంతో అపురూపంగా పెంచుకున్న అమ్మాయిలేనా? కొడుకు కోసం కలవరించిపోయేది. ప్రతిమనిషికి తనువు దూరమై పోయాక ఇదే పరిస్థితి దాపురిస్తుందా? ఏమిటీ ప్రకృతి వైపరీత్యం చనిపోయిన అమ్మను గురించి గాని, బ్రతికున్న తోడుపోయిన నాన్న గురించి గాని ఈ మనుషులు ఆలోచించడం లేదేం? తను ఇంత సంపద ఏర్పరచడం పొరపాటు

చేశాడా? ఈ సంపాదనే లేకపోతే వాళ్ళు అసలు వచ్చేవాళ్ళా తల్లి పోతే.

మెల్లగా మెట్లుదిగి మోహనరావు, క్రింద ఆడుకుంటున్న మనవలను చూశాడు. వాళ్ళకు ఈ విషయాలు తెలియవు ఇదేమీ పట్టవు, కల్లాకపటం ఎరగనివాళ్ళు.

పెద్దకూతురు ఎదురు వచ్చింది.

“ నాన్నగారూ కొంచెం ఎంగిలిపడండి. ”

“ లేదురా ఆకలిగా లేదు. ”

“ అలా అంటే ఎలా చెప్పండి పోయిన వాళ్ళతో మనమూ పోతామా మాకు మీరు అయినా లేకుండా చేస్తారా? ”

“ నాకు ఆ అదృష్టం లేదమ్మా ? మీ అమ్మ దగ్గరికి వెళ్ళాలనే వుంది కాని అది నా చేతిలో లేదమ్మా – ”

“ చాల్లెండి మీరు మరీ పిచ్చివాళ్ళైపోతున్నారు రండి నాలుగు మెతుకులు తిందురుగాని ” అంటూ తండ్రిని డైనింగ్ హాల్‌లోకి తీసుకువెళ్ళింది.

* * *

“ ఇంటి చావిడిలో ఇద్దరమ్మాయిలు పిల్లలకు జడలు వేస్తున్నారు. మగపిల్లలు ఆడుకుంటున్నారు. కొడుకు కోడలు ఉయ్యాలబల్ల మీద కూర్చున్నారు. ఆరోజే అందరూ ప్రయాణం. తండ్రితో విషయాలు ముచ్చటించి, తరువాత తమ అభిప్రాయాలు చెప్పి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోదామని అనుకున్నారు. ఈలోగా తండ్రి బయటకు వెళ్లాడు. ”

బయట ఆటో ఆగిన చప్పుడైంది. ఒక్కసారి అందరు బయటకు వెళ్ళారు. ఆటోలోంచి తండ్రి, ఒక నడివయసు స్త్రీ అచ్చు వాళ్ళమ్మలాగా వుంది. ఆమె అమ్మ నగలు వడ్డాణం పెట్టుకుని అచ్చు అమ్మలాగే పచ్చగావుంది ఇద్దరూ దిగారు.

“ దారికి అడ్డం లేవండిరా. మీ పిన్నిని లోపలికి తీసుకువెళ్ళండి అచ్చు మా అమ్మలాగే ఉంది అందుకే తీసుకువచ్చాను. ” అన్నాడు మోహన్.

అంతే

అందరూ లోపలకు వెళ్ళిపోయారు విసురుగా, చిన్నపిల్లలు మాత్రం ఆమె చుట్టూ మూగేరు.

“ తాతగారూ కొత్త మామ్మా- ”

" అవునర్రా. మీ కన్నా తెలిసింది. "

ఇద్దరూ లోపలకు వెళ్ళారు. ఉయ్యాల బల్లమీద మోహన ఆమెతో కూర్చున్నాడు. అరగంటయ్యాక పెద్దమ్మాయి సామానుతో బయటకు వచ్చింది.

" నాన్నగారూ నేను వెళ్తున్నాను. మీ పెద్దమ్మాయిని మర్చిపోండి. అమ్మను ఇంత త్వరగా మర్చిపోయి ఇంకో స్త్రీని మీ జీవితంలోకి ఆహ్వానిస్తారని మేము ఎప్పుడూ అనుకోలేదు. అయినా కోరికలు చంపుకోలేని మీ దుర్బల మనస్తత్వానికి, మీరు మా నాన్నగారని చెప్పుకోదానికి సిగ్గుగా ఉంది- " అంటూ బయటకు వెళ్ళిపోయింది. ఆ వెనకాలే చిన్నకూతురు.

" ఏమ్మా నీ అభిప్రాయం ఏమిటి? "

" అక్క చెప్పిందిగా నాన్నగారూ. నేను ఇంక చెప్పేదేముంది ! మేము సొసైటీలో తల ఎత్తుకు తిరక్కుండా చేశారు. మా పిల్లలకు పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి " అంటోంది.

ఈలోగా, కొడుకు కోడలు లగేజీతో బయటకు వచ్చారు.

" నాన్నగారూ - " అంటూ కొడుకు ఏదో చెప్పబోయాడు-

" ఆగు బాబూ - " అంటూ మోహనరావు అందర్నీ పరికించి చూశారు. అందరూ ఆమెను తమ అమ్మస్థానంలో నాన్న జీవితంలోకి అక్రమంగా, ప్రవేశించినందుకు, కోపంతో చూస్తున్నారు. వాళ్ళ చూపులకు శక్తి వుండివుంటే ఆమె ఈపాటికి దహించుకు పోయివుండేది.

" మీరు ఎవరూ ఏమీ చెప్పద్దు. ఈమెను వితంతు శరణాలయం నుండి తీసుకువచ్చాను. మనవాళ్ళే ఈమె కూడా నాలాగే తోడుపోయి, మీలాంటి పిల్లల్ని కని అనాధాశ్రమంలో చేరింది. తన డబ్బు కట్టుకుని దిక్కులేని దానిలా వుంటోంది. "

అమ్మ పోయాక మీ ఆలోచనలు, మీ పద్ధతులు చూశాను. ఎప్పుడూ నా డబ్బు, అమ్మ నగలు, వెండిసామాన్లు ఆస్థిపాస్తులు తప్ప, మీకు అసలు విషయం అమ్మను పోగొట్టుకున్న నాన్నను ఎలా అనునయించాలి. అమ్మను మర్చిపోయేట్టుగా నాన్నను ఎలా సముదాయించాలి. అని ఎప్పుడైనా, ఏ క్షణమైనా మీరు ఆలోచించారా? చెప్పండి- లేదు - మీరు ఆలోచించరు దానికి కారణం ఎవరు?

నేనే-నేను మీ అందరికోసం, అనంతమైన సంపద సంపాదించాను. మీ అమ్మగాని, మీరు గాని ఏవిధమైన లోటు, కూడు, గూడుకు వుండకూడదని పరితపించాను. అలాగే చేశాను మీ అమ్మ ఎన్నోసార్లు ఏడువారాల నగులు కూతుళ్ళకు, కోడలికి ఇచ్చేస్తానంటే తను

బ్రతికుండగా అది జరగడానికి వీలులేదని ఒప్పుకోలేదు.

నేను మీకు సిగ్గు కలిగించే పని చేశాను. నిజమే అయితే మీ పిల్లలకు పెళ్ళిళ్ళు కావనే దిగులు పెట్టుకోకండి డబ్బుతో ఏపనైనా చేసేయచ్చు. మీరు ఈ గాయం మానేక ఎలాగూ నాదగ్గరకు వస్తారు నాకు తెలుసు.

నాకు ఈ వయసులో తోడు కావాలి. కాని శృంగారం కాదు. మీరు మీ భర్తలను వొదిలి రాలేరు. అన్నయ్య వదినను వదిలి వుండలేదు. సరిగ్గా మగాడికి ఏ వయసులో తోడు కావాలో, ఆ వయసులో నన్ను వొంటరివాడిని చేసి వెళ్ళిపోయింది మీ అమ్మ -

అందుకే ఈమెను తీసుకు వచ్చాను. మీరు ఈమెను అమ్మగా స్వీకరించాలి తప్పదు.

మోహనరావు కళ్ళవెంట కన్నీరు ధారాపాతంగా వర్షిస్తోంది. కళ్ళు తుడుచుకుని చూశాడు.

అందరూ వెళ్ళిపోయారు.

ఇల్లు ఖాళీ అయిపోయింది.

" అయ్యగారూ అందరూ వెళ్ళిపోయారు నాకు డబ్బులు ఇవ్వండి వెళ్ళిపోతాను - " అంటూంది ఆమె.

ఆమె ధరించిన పట్టుచీర, నగలు ఉయ్యాల బల్లమీద వున్నాయి. ఆమె చేతిలో రెండువందలు పెట్టాడు మోహన.

"వస్తానయ్యా కొద్ది సేపయినా మీ వంటి వారి భార్యగా ప్రక్కన కూర్చోవడం నాకు ఎంతో సంబరంగా వుందయ్యా.." అంటూ వెళ్ళిపోయింది.

వీధి తలుపులేసి రాజ్యం ఫోటో ముందు కూర్చుని, "రాజ్యం క్షణం పరాయి స్త్రీ ప్రక్కన కూర్చున్నందుకు నన్ను క్షమిస్తావు కదూ..." అంటూ విలపిస్తున్నాడు మోహన.

రాజ్యం నవ్వుతున్నట్లుంది ఫోటోలో.

***